క్లుప్తంగా

దాణా కిట్ల పంపిణీ



బూదవాడ(జగ్గయ్యపేట): ఒంగోలు జాతి ఆవు దూడల రైతులకు పశుగణాభివృద్ధి సంస్థ డీఎల్‌డీఏ శ్రీనివాసులు శనివారం దాణా కిట్లు పంపిణీ చేశారు. బూదవాడలోని సచివాలయం వద్ద జరిగిన ఈకార్యక్రమంలో డీఎల్‌డీఏ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద గుంటూరు లాం ఫాం రీసెర్చ్ స్టేషన్ నుంచి గ్రామంలోని 10మంది రైతులకు ఒంగోలు జాతి లక్షణాలు కలిగిన కోడె దూడలను పంపిణీ చేశామన్నారు. కోడె దూడలు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏడీఏ వెంకటేశ్వరరావు, వైద్యాధికారి ప్రసన్న, వీఏఎస్ సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

ప్రతిభచూపిన బీజేటీ విద్యార్థి



కంచికచర్ల : కీసరలోని బీజేటీ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ప్రత్తిపాటి రూబెన్ పల్నాడు జిల్లా నరసరావుపేటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-19 అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రూబెన్‌ను ప్రిన్సిపాల్ దుగ్గిరాల ప్రకాష్, కళాశాల సెక్రటరీ ఆంటోని శనివారం అభినందించారు. ఆంటోని మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించటంతోపాటు వారిని క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. బ్రదర్ పోలవరపు సుధీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



గొట్టుముక్కల(కంచికచర్ల): గొట్టుముక్కలలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన చింతల నరసింహారావు(47)కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా తొలివిడతగా మంజూరైన రూ.10వేలను సొసైటీ మాజీ అధ్యక్షుడు తాటుకూరు గంగాధరరావు శనివారం అందజేశారు. మిగిలిన బీమా నగదును త్వరలోనే అందజేస్తామని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ యాసిన్ వివరించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, ది బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఇండియా ఇంటర్నేషన్ డిప్యూటీ డైరెక్టర్, పాస్టర్ ఎ.విజయరావు ముఖ్య ఉపదేశకులుగా పాల్గొని దైవసందేశం ఇచ్చారు. క్రిస్మస్ కేకును కట్ చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కఠారి హరిబాబు, తుమ్మల వెంకట నాగమణి, సూపరిండింటెంట్ హరీష్, బ్రదర్ సామాల ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు చర్యలు : ఏసీపీ

నందిగామ టౌన్: నందిగామలో ఆదివారం సామాజిక సాధికార బస్సుయాత్ర, బహిరంగ సభ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు ఏసీపీ జనార్దన్‌నాయుడు శనివారం తెలిపారు. సాధికార యాత్రకు వచ్చే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పోలీసు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆయన కోరారు. బస్సు యాత్రకు వచ్చే వాహనాల కోసం ఆయా మార్గాలకు అనుగుణంగా పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేశామని చెప్పారు. నందిగామలోని చందర్లపాడు రోడ్డులోగల కెవీఆర్ కళాశాల, శ్రీకరం కళ్యాణ మండపం పక్కనున్న ఖాళీ ప్రదేశం, రామన్నపేట రోడ్డులోని పశువుల వైద్యశాలలో పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఏసీపీ వెంట సీఐలు హనీష్, నాగేంద్రకుమార్, జానకిరామ్ ఉన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో ర్యాలీ

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక ఉక్కు కళావేదికలో బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొదమల ప్రభుదాసు ఆధ్వర్యంలో బహుజన రాజ్యాధికార చైతన్య సభ జరిగింది. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే మండల స్థాయిలో అంతర్జాతీయస్థాయి పాఠశాలలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి. పుష్పరాజు, లక్కెపోగు వందన్‌కుమార్, రామకృష్ణ, జి.దేవా, ఉడుముల బుజ్జి, దాసరి కృష్ణ, దొండపాటి శామ్యూల్‌కుమార్, బర్రె ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా.. నందిగామ

- సీఎం జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో వందలాది కోట్ల నిధులు
- పెరిగిన మౌలిక వసతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నందిగామలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయం



అభివృద్ధికి చిరునామాగా మారిన నందిగామలోని గాంధీ సెంటర్ (ఇన్‌సెట్) ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు

నందిగామటౌన్: నందిగామ...నాలుగు మండలాలు...69గ్రామాలకు కేంద్రబిందువు...దశాబ్దాల క్రితం వేసిన పైప్‌లైన్లు...మురుగునీరు పారుదల కాని డ్రైనేజీలు...ఒక వాహనం ఎదురుగా వస్తే మరో వాహనం తప్పుకోలేనంత ఇరుకు రోడ్లు..ఇదీ మూడు దశాబ్దాల టీడీపీ పాలనతో నాలుగున్నరేళ్ల కిందటి వరకు నందిగామ దుస్థితి. 2019లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వందలాది కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులతో నేడు నవ నందిగామగా రూపాంతరం చెందింది. అడుగడుగునా టీడీపీ నాయకులు సృష్టిస్తున్న అడ్డంకులను అధిగమిస్తూ..ఎన్నో సవాళ్లను ప్రతిఘటిస్తూ అభివృద్ధికి చిరునామాగా నిలిచింది. మూడు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని నందిగామ ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు అలుపెరుగని పనితీరుతో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని చెప్పవచ్చు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు నియోజకవర్గంలోని గడపగడపకు వెళ్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని ఉన్నతాధికారులు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు సమప్రాధాన్యత ఇస్తూ నాలుగున్నరేళ్లుగా ప్రజామన్ననలు పొందుతున్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయించి వారి సొంతింటి కలను సాకారం చేశారు.

రూ.570 కోట్లతో అభివృద్ధి..

నందిగామ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రూ. 570 కోట్ల అభివృద్ధి జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గతంలో కనీస అభివృద్ధికి నోచుకోని నందిగామ ప్రస్తుతం అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న మురుగు నీటి పారుదల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. పూర్తిస్థాయిలో ప్రజల అవసరాలకు సరిపడా తాగునీటిని సరఫరా చేస్తూ ప్రధాన సమస్యలకు స్వస్తి పలికిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే దక్కింది. ఓట్లు, రాజకీయాలు చూడకుండా ప్రజలకు వసతుల కల్పనే మిన్నగా భావించి ఇరుకు రహదారులతో నిత్యం ప్రమాదాలతో రక్తం దాహం తీర్చుకుంటున్న రహదారులను విస్తరించి అభివృద్ధి అంటే ఇలా ఉండాలి అనేస్థాయిలో పనిచేయడం ద్వారా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పేరు తెచ్చుకున్నారని నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు..

నందిగామ ప్రాంత పేద విద్యార్థులకు జాతీయస్థాయి విద్యాబోధన అందించాలనే సంకల్పంతో నందిగామకు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించారు. రూ.74లక్షలతో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటుచేసి రానున్న విద్యా సంవత్సరం నుంచి తరగతులు నిర్వహించేలా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు కృషి చేశారు. నందిగామ ప్రజల దశాబ్దాల కలగా మిగిలిన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరు చేయించారు. నగర పంచాయతీగా ఉన్న నందిగామను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయించారు.

నాలుగున్నరేళ్లలో చేపట్టిన ప్రధాన అభివృద్ధి పనులు..

- నాలుగు మండలాల పరిధిలో 56గ్రామాల్లో రూ.22.40 కోట్లతో సచివాలయ భవనాలు నిర్మాణం.
- రూ.12.64కోట్లతో 58 రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు
- 42 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు రూ.7.35కోట్లు మంజూరు.
- నందిగామలోని సీఎం రోడ్డును రూ.1.78కోట్లతో విస్తరణ. ఎన్టీఆర్ రోడ్డుగా నామకరణం
- రూ.18 కోట్లతో కంచికచర్ల - వీరులపాడు మండలం పెద్దాపురం రోడ్డు అభివృద్ధి
- నియోజకవర్గంలో రూ.91.8 కోట్లతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ల ఏర్పాట్లు
- కంచికచర్లలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రూ.20కోట్ల నిధులు మంజూరు.
- రూ.14.50 కోట్లతో నాడు-నేడు కార్యక్రమం ద్వారా నాలుగు మండలాల పరిధిలోని 70 పాఠశాలల అభివృద్ధి
- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సొంత నిధులు రూ.50లక్షలతో ఉచిత కోచింగ్ సెంటర్ ద్వారా నిరుపేద నిరుద్యోగ యువతకు శిక్షణ, ఇటీవల జరిగిన పోలీసు ఉద్యోగాల రాతపరీక్షల్లో 300 మంది ఉత్తీర్ణత.
- కంచికచర్ల మండలం వసంతకాలనీలో రూ.15 కోట్ల వ్యయంతో చేతికందే ఎత్తులో ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగల మార్పిడి.
- కంచికచర్ల మండలం కీసర నుంచి వీరులపాడు మండలం గోకరాజుపల్లి వరకు రహదారి విస్తరణకు రూ.1.20 కోట్ల మంజూరు.
- రూ.2.20 కోట్లతో పల్లెంపల్లి - వీరులపాడు రహదారి ఏర్పాటు.
- రూ.6.80 కోట్ల గడపగడపకు మనప్రభుత్వం నిధులతో పలు అభివృద్ధి పనులు.
- సీఎస్ఆర్ నిధులు రూ.4కోట్లతో నందిగామలో రోడ్డు అభివృద్ధి, గాంధీ సెంటర్ సుందరీకరణ.
- ప్రజల సౌకర్యార్థం వీరులపాడు మండల కేంద్రంగా జుజ్జూరు ఏర్పాటు.

100 పడకల ఆస్పత్రికి రూ.43కోట్లు..

గత పాలకుల హయాంలో 50 పడకల ఆస్పత్రిగా కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ మాత్రమే ఉండేది. నందిగామ జాతీయ రహదారి పక్కన ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటూ ఏటా వందలాది మంది గాయపడుతున్నారు. గాయపడిన వారికి పూర్తిస్థాయి వైద్య సదుపాయం అందక పలువురు మృత్యువాత పడుతున్న పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సకల సదుపాయాలతో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఎమ్మెల్యే జగన్‌మోహనరావు రూ.43కోట్లు మంజూరు చేయించారు. అదేవిధంగా రూ.1.92 కోట్లతో నందిగామ డీవీఆర్ కాలనీ, అనాసాగరంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. కరోనా సమయంలో రూ.50 లక్షలతో కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసి కరోనా బాధితులకు ఆపన్నహస్తం అందించారు.



18వ వార్డులో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్



రెండు లైన్ల రహదారిగా అభివృద్ధి చేసిన నందిగామలోని సీఎం రోడ్డు



నందిగామలోని ఆర్డీఓ కార్యాలయం

ఎమ్మెల్యే తనమాట నిలబెట్టుకున్నారు..



నాలుగున్నరేళ్లుగా నందిగామ అభివృద్ధికి చిరునామాగా మారింది. మూడు దశాబ్దాలుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని నందగామను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అభివృద్ధి చేసి చూపుతున్నారు. నందిగామను అన్నిరకాలుగా అభివృద్ధి చేసి చూపుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. – గద్దె రమేష్, నందిగామ

అడ్డంకులను దాటుకుని అభివృద్ధి ..



అభివృద్ధి చేస్తుంటే స్వాగతించాల్సిన ప్రతిపక్ష టీడీపీ అడుగడుగునా అడ్డుకోవటమే కాకుండా కోర్టులను ఆశ్రయించింది. అయినా అభివృద్ధికి ఏమాత్రం వెనకడుగు వేయకుండా అడ్డంకులను దాటుకుని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందుకు వందలాది కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులే నిదర్శనం. – బెజవాడ రాజశేఖర్, నందిగామ

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



విప్ సామినేని ఉదయభానును సత్కరిస్తున్న తన్నీరు నాగేంద్ర, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమితులైన తన్నీరు నాగేంద్ర, మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్తకార్యదర్శిగా నియమితులైన పఠాన్ ఫిరోజ్‌ఖాన్‌లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అభినందించారు. నూతనంగా పార్టీ పదవులకు ఎంపికైన నాయకులు శనివారం ఎమ్మెల్యే ఉదయభానును ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు. తమ నియామకానికి సహకరించారంటూ ఎమ్మెల్యే ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంచపు నారాయణ, నియోజకవర్గ అధ్యక్షుడు వేముల మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు గుంజ లక్ష్మణ, సచివాలయ కన్వీనర్ తాళ్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



సీసీరోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణాన్ని జాతీయ రహదారిపైకి విస్తరింపజేసి రికార్డుస్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని 22, 31వవార్డుల్లో రూ.12లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ నందిగామ, కోదాడ పట్టణాల మాదిరిగా జగ్గయ్యపేట పట్టణాన్ని కూడా జాతీయ రహదారి వరకు విస్తరించేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషితో పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా రూపొందించనున్నట్లు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమ సమయంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని 22, 31వవార్డుల ప్రజలు ఎమ్మెల్యే ఉదయభానును కోరడంతో ఈ మేరకు ఆయన చర్యలు తీసుకుని రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, మున్సిపల్ కౌన్సిలర్లు వట్టెం మనోహర్, గింజుపల్లి వెంకట్రావు, గొట్టె నాగరాజు, వెంకట్, పేరం సైదేశ్వరరావు, ఇర్రి నరసింహారావు, కోఆప్షన్ సభ్యులు చైతన్యశర్మ, నాయకులు కొరకూటి సైదులు, గింజుపల్లి కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కు ఎంతో విలువైంది

నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు



ర్యాలీలో పాల్గొన్న జిల్లా నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తహశీల్దార్లు, ఈఆర్‌వో తదితరులు

జగ్గయ్యపేట అర్బన్ : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైనదని ఎన్టీఆర్ జిల్లా నోడల్ ఆఫీసర్ యు.శ్రీనివాసరావు అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేటలో శనివారం ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. నీ ఓటు నీ భవిష్యత్, 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు నమోదు చేసుకోవాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సూచించారు. ఈఆర్‌వో మహేష్ స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగితేనే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ 17ఏళ్లు నిండిన యువతీయువకులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే 18ఏళ్లు నిండిన వెంటనే అధికారులు వారి ఓటును నమోదు చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి తహశీల్దార్ మన్నె సూర్యారావు అధ్యక్షత వహించగా, పెనుగంచిప్రోలు తహశీల్దార్ లక్ష్మీ కల్యాణి, ఎలక్షన్ డీటీ యు.కిషోర్‌బాబు, డీటీ నాగరాజు, ఆర్ఐ యు.ఆనంద్‌బాబు, బీఎల్‌వోలు విద్యార్థులు, ఆయా శాఖల అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.30.85 లక్షలతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నందిగామ పట్టణాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణంలోని 16వవార్డులో రూ.30.85లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నానని వివరించారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ పాకాలపాటి కిరణ్, నాయకులు అచ్చి శ్రీకర్, పాములపాటి రమేష్, ఓర్సు జ్వాలా, షేక్ ఫాతిమా, వల్లెపు రవి, మున్సిపల్ కమిషనర్ జయరాం, ఏఈ ఫణిశ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

19 నుంచి ఓటర్లకు అవగాహన

పెనుగంచిప్రోలు: మండలంలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు ఓటర్లకు ఈవీఎం, వీవీపాట్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కె.లక్ష్మీకల్యాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న ఉదయం శ్రీతిరుపతమ్మవారి ఆలయ సమీపంలో, సాయంత్రం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, 21న పెనుగంచిప్రోలు అంబేడ్కర్ సెంటర్, సాయంత్రం పాత సినిమాహాల్ సెంటర్, 22న ఉదయం అనిగండ్లపాడు సచివాలయం -1వద్ద, సాయంత్రం రామాలయంవద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీముక్తేశ్వరస్వామి ఆలయంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి విశేష అర్చనలు చేశారు. ఈనెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారదర్శనం, 27న లక్ష తులసి పూజ నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

పెన్షనర్లంతా హాజరుకావాలి

కంచికచర్ల : స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఈనెల 17న అఖిల భారత పెన్షనర్స్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు శనివారం తెలిపారు. విశ్రాంత ఉద్యోగులంతా తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

సాధికార యాత్రకు ఏర్పాట్లు పూర్తి



బస్సు యాత్ర రూట్‌మ్యాప్‌ను అరుణకుమార్‌కు వివరిస్తున్న పోలీసులు

నందిగామ టౌన్: సామాజిక సాధికార బస్సు యాత్రకు వచ్చే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్ తెలిపారు. పట్టణంలో ఆదివారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను పోలీస్ అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్‌తోపాటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా బస్సుయాత్ర, బహిరంగ సభకు వచ్చే మహిళలు, వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చేవారికి ఆయా మార్గాలలో స్టాల్స్ ఏర్పాటు చేసి మజ్జిగ, మంచినీటిని అందిస్తున్నట్లు చెప్పారు. బందోబస్తు ఏర్పాట్లను ఏసీపీ జనార్దన్ నాయుడు, సీఐలు హనీష్, నాగేంద్రకుమార్, జానకిరామ్, పరిశీలించారు.

వై జంక్షన్ నుంచి బస్సు యాత్ర..

నందిగామ పట్టణ సమీపంలోని అంబారుపేట వై జంక్షన్ నుంచి సామాజిక సాధికార బస్సు యాత్ర ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమవుతుందని అరుణకుమార్ తెలిపారు. వై జంక్షన్ నుంచి రైతుపేట, సీఎం రోడ్డు, మున్సిపల్ కార్యాలయం మీదుగా బహిరంగ సభ జరగనున్న గాంధీ సెంటరుకు చేరుతుందన్నారు. ముందుగా స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రులు, ఎంపీలు, ప్రముఖులతో విలేకరుల సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

బస్సు యాత్రకు వచ్చే ప్రముఖులు..

నందిగామలో ఆదివారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు విచ్చేస్తున్నట్లు అరుణ్‌కుమార్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ప్రభుత్వ విప్, సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, వసంత కృష్ణ ప్రసాద్, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, కొక్కిలిగడ్డ రక్షణనిధి, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పార్టీ విజయవాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహిళా సాధికారతతోనే రాష్ట్రాభివృద్ధి



15వవార్డు ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: మహిళా సాధికారతతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తలచి అందుకనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని 15వ వార్డులో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన సంక్షేమ క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. మహిళల రక్షణకు దిశ యాప్‌ను రూపొందించి దేశానికే ఆదర్శంగా నిలిచారని చెప్పారు. నామినేటెడ్ పదవుల్లో సైతం మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తుచేశారు. మహిళలు మాత్రమే కాకుండా రైతులు, విద్యార్థు లు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ప్రజలకు అన్ని రకాలుగా మంచి చేస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో మద్దతు పలికి ఘనవిజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఓర్సు లక్ష్మీ, పాకాలపాటి కిరణ్, వార్డు కన్వీనర్ ఓర్సు జ్వాలా, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాములపాటి రమేష్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, అచ్చి శ్రీకర్, షేక్ జాఫర్, ఓర్సు కొండ, నాయకులు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్ష

నందిగామ టౌన్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తనదృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మూడు, నాలుగు వార్డుల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారంపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రతి సమస్యను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, గత ప్రభుత్వాలకు సాధ్యం కాని రీతిలో నందిగామ పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపిస్తున్నామని వివరించారు. సమావేశంలో కౌన్సిలర్లు షేక్ ఖాలిక్, మారం అమరయ్య, కమిషనర్ డాక్టర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.